పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

నులి పురుగుల నిర్మూలన దినోత్సవం


బాలానగర్ ప్రాథమిక పాఠశాలలో..



పంచశీల పాఠశాలలో..

బాలానగర్: తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బాలానగర్ మండల ప్రాథమిక పాఠశాలలో బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మమతతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నులిపురుగులు ఉన్న పిల్లలకు పౌష్టికాహార లోపం, రక్తహీనతలతో బాధపడుతుంటారని, శారీరక, మానసిక అభివృద్ధిలో లోపిస్తుందన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, డాక్టర్ రాజలక్ష్మీ, సిహెచ్ఓ మన్మథమ్మ, పిహెచ్‌యస్ రాములమ్మ, ఏఎన్ఎం రోహిణి, ఇందిరా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

డీ వార్మింగ్ మాత్రల పంపిణీ..

ఆల్విన్‌కాలనీ: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు చాలా ప్రమాదకరమైనవని, పిల్లలు అపరిశుభ్రమైన ప్రదేశాల్లో ఎక్కువ ఆటలు ఆడటం, మల విసర్జన ద్వారా నులి పురుగులు వ్యాప్తి చెందే అవకాశాలున్నాయన్నారు. ఈ నులి పురుగుల భారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా భోజనం చేసే ముందు తప్పకుండా చేతులు శుభ్రంగా కడుగుకోవాలని, పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయచంద్ర, పాఠశాల హెచ్‌యం రాధ పద్మజ, ఉపాధ్యాయులు, శానిటేషన్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి, వైద్య సిబ్బంది ప్రియాంక, సుజీలీల, జ్యోతి, శశిరేఖ, సంతోషి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పంచశీల పాఠశాలలో ..

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో గురువారం మూసాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ టాబ్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పంచశీల శ్రీనివాస్, ఆశ వర్కర్లు తులసి, సుమ, మానస తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


ఆయిల్ బాల్స్ వేస్తున్న మాజీ కార్పొరేటర్ బాబురావు, ఎంటమాలజీ సిబ్బంది

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ అంబేడ్కర్ నగర్‌లోని ముళ్ల కత్వ చెరువులో గురువారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు మాట్లాడుతూ చెరువులోని గుర్రపు డెక్కను తొలగిస్తామని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజి సిబ్బంది నగేష్, మహేందర్‌రెడ్డి, దామోదర్, ఎస్‌జీఓ రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర- ఏడీపీ సంస్థ చేయూత

37వేల మంది పిల్లలకు భోజనాలు అందజేత

రాయదుర్గం: ఏడీపీ హైదరాబాద్ సంస్థ తన ఔదార్యాన్ని చాటుకుంది. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బిజినెస్ అవుట్‌సోర్సింగ్, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, సొల్యూషన్స్ సేవలందించే ఏడీపీ ఐటీ సంస్థ నెల రోజుల్లో 37వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 9 లక్షల భోజనాలు అందించేందుకు ముందుకొచ్చింది. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏడీపీ సంస్థలోని అసోసియేట్ వారి కుటుంబం ముగ్గురు పిల్లలకు ఆహారం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్, హెచ్‌ఆర్ హెడ్ వెంకటేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా గత 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు దేశమంతటా చేపడుతున్నామన్నారు.

ఎమ్మెల్యే విమర్శలు అర్ధరహితం..

కూకట్‌పల్లి కాంగ్రెస్ నేత శేరి సతీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలు అర్ధరహితమని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత అభివృద్ధి పనులు నిలిచిపోయాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శల నేపథ్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో అధికారులను బెదిరించేలా వ్యవహరించటం సరికాదన్నారు. సమీక్ష సమావేశాలు జోనల్ కార్యాలయంలో నిర్వహించాలని, క్యాంపు కార్యాలయంలో కాదన్నారు. నియోజకవర్గంలో మూడు నెలలుగా అభివృద్ధి కుంటుపడిపోయిందని మాట్లాడటం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నెల రోజులకు పైగా ప్రభుత్వ నిధులు కేటాయింపులు జరపకూడదనే విషయం ఎమ్మెల్యేకు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉంటే ఎమ్మెల్యే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ఫుట్‌బోర్డు ప్రయాణంపై ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్

రాయదుర్గం: ఆర్టీసీ బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలతో ప్రమాదాల బారినపడకుండా ఆర్టీసీ సంస్థ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. సికింద్రాబాద్ రీజనల్ పరిధిలో మొదటి విడత ప్రయోగాత్మకంగా అమలు చేస్తూ ఇది విజయవంతమైతే రాష్ట్రమంతా అమలు చేసేలా ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని అమలు చేశారు. డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి డిపో అధికారులు, సిబ్బందితో వెళ్ళి మొదటిరోజు లింగంపల్లి నుంచి ఆల్విన్‌కాలనీ వరకున్న బస్టాపులలో బస్సుల రాకపోకలు, బస్సులు నిలిపే పద్ధతిని, ఫుట్‌బోర్డు ప్రయాణం, ఆక్యుపెన్సిరేషియోను ఆయన పరిశీలించారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మధుమేహంపై అవగాహన

సనత్‌నగర్: భారతీయ యోగా సంస్థాన్ (బీవైఎస్) తెలంగాణ రాష్ట్ర (ఈస్ట్) డిస్ట్రిక్-1 ఆధ్వర్యంలో సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కులో మధుమేహంపై అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో సంస్థాన్ డిస్ట్రిక్-1 అధ్యక్షుడు వర్ధన్‌నాయక్, సెక్రటరీ యుగంధర్, విరించి జోన్ ప్రెసిడెంట్ కుసుమ హాజరై సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, ధ్యానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దైనందిన జీవితంలో తలెత్తే ఆరోగ్య రుగ్మతలను యోగ ద్వారా ఏ విధంగా అధిగమించవచ్చో తెలియజేయడమే కాకుండా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు.

అవకాశవాద నాయకులను దూరం పెట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: అవకాశవాదంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓయూ పూర్వ విద్యార్థి నాయకులను నామినేటెడ్ పదవులకు దూరం పెట్టాలని ఓయూ జేఏసీ నేతలు భీమ్‌రావ్ నాయక్, ప్రతాప్‌రెడ్డి, పూసల రమేష్, రమేష్ రాథోడ్ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ.. ఓయూ పూర్వ విద్యార్థి నాయకుల్లో కొందరు గతంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో కొనసాగుతూ రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలను విమర్శించి నేడు పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌లో చేరారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓటమి కోసం ప్రచారం చేసిన ఓయూ పూర్వ విద్యార్థి నేతలు నేడు పార్టీలో చేరి పదవులను ఆశించడం సిగ్గుచేటన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఆలేరు ఎమ్మెలే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కురమ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు డా.కంకల ఎలెందర్, ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డా. రామ్ షెఫర్డ్ కోరారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 40 లక్షల జనాభా గల గొల్ల కురుమలకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని లేకుంటే గొల్లకురుమల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయనున్నట్లు హెచ్చరించారు.

నిబంధనలు పాటించడం అందరి బాధ్యత

సనత్‌నగర్: రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ సిబ్బందికి గురువారం 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ.. వాహనాలతో రోడ్ల మీదకు వచ్చామంటే విధి గా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్లకు అడ్డుకట్ట వేయండి


విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్ల ద్వారా నిత్యం లక్షల లీటర్ల నీటిని తోడేస్తూ మౌలిక వనరులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పాపిరెడ్డినగర్ అధ్యక్షులు చంద్రారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువవారం ఆయన అక్రమ వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ , కూకట్‌పల్లి మండల తహశీల్దార్, స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. అధికారుల అండతోనే ప్లాంట్ల నిర్వాహకులు నీటి వ్యాపారం చేస్తున్నారన్నారు. పాపిరెడ్డినగర్‌లో ఐదు వాటర్ ప్లాంట్‌లు అనుమతి లేకుండా కొనసాగుతున్నాయని, తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ వాటర్ ప్లాంట్లను సీజ్ చేసినా మర్నాటి నుంచే సీల్‌లను తొలగించి వాటర్ ప్లాంట్‌లు కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వాటర్ ప్లాంట్ల కారణంగా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, బస్తీలో నీటి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. గురువారం విద్యుత్ శాఖ అధికారి శరత్ బాబును కలిసి విద్యుత్ సమస్యకు కారణం అవుతున్న వాటర్ ప్లాంట్‌లపై చర్యలు తీసుకుని మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు మొగుళ్ల కనగారెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ...


విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ అధ్వర్యంలో అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం 50 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకరాజు, శ్రీరాములు, కుంటన్న, ఈ శ్రీనివాస్, కాసు అశోక్, అంజీ, మల్లేష్, షాయిన్‌షా, అక్తర్, గౌస్, శ్రీనివాస్, ఆనంద్, వెంకటేశ్, లరవింద్‌గౌడ్, కృష్ణరెడ్డి, నరేష్, సలీం, మల్లేష్, షబ్బీర్, సాజీద్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మాధవరం సుదర్శన్‌రావు సేవలు ఎనలేనివి



సుదర్శన్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, తదితరులు

కూకట్‌పల్లి: కార్మికుల సంక్షేమం కోసం దివంగత నేత మాధవరం సుదర్శన్‌రావు చేసిన సేవలు ఎనలేనివని, కార్మికులతో పాటు ప్రజల హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మాధవరం సుదర్శన్‌రావు జయంతి సందర్భంగా మూసాపేటలోని గూడ్స్‌షెడ్ రోడ్డులో హమాలి యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. రఘునందన్ నేత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కార్మికులు, స్థానిక నాయకులు హాజరై సుదర్శన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవన్‌కుమార్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులైన సుదర్శన్‌రావు ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారని, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా గూడ్స్‌షెడ్ హమాలీల కోసం పాటుపడ్డారని కొనియాడారు. సుదర్శన్‌రావు నిత్యం ప్రజలతో ఉంటూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించేవారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, సుదర్శన్‌రావు కుమారుడు అభిలాషరావు, కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, బీఆర్‌యస్ నాయకుల నరసింహ ముదిరాజ్, గజ్జల నగేష్, కపిల్‌రాజునేత, మాచర్ల భద్రయ్య, సునీల్ రెడ్డి, విజయ్‌కుమార్, రామ్మోహన్‌రావు, నజీర్, సిహెచ్. అనిల్‌రావు, శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాధవరం సుదర్శన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండి రమేష్

కార్మిక పక్షపాతి సుదర్శన్‌రావు..

కూకట్‌పల్లి: దివంగత కార్మిక నేత మాధవరం సుదర్శన్‌రావు కార్మిక పక్షపాతని, కార్మిక లోకానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. సుదర్శన్‌రావు 66వ జయంతిని పురస్కరించుకుని గురువారం మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో సుదర్శన్‌రావు విగ్రహానికి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సుదర్శన్‌రావు నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం శ్రమించిన గొప్ప మానవతావాది అన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

23న జానపద నృత్య ప్రదర్శన

కూకట్‌పల్లి: భారత వికాస్ పరిషత్ సౌజన్యంతో యువ కళావాహిని శ్రీకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ వాణి నృత్య నికేతన్ విద్యార్థినులచే ఈ నెల 23న సాయంత్రం కూకట్‌పల్లి రామాలయ సమీపంలోని భారత్ వికాస్ పరిషత్‌లో జానపద నృత్య ప్రదర్శన, కళాకారులకు సత్కారం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవి, విశ్లేషకులు పీఎస్. మూర్తి, సభాధ్యక్షులుగా యువ కళావాహిని అధ్యక్షులు, విశిష్ట అతిథులుగా ప్రముఖ కథక్ నాట్య గురువు అంజుబాబు, ఆత్మీయ అతిథులుగా సినీనటి కె. గాయత్రి భార్గవి హాజరుకానున్నట్లు కన్వీనర్ రఘుశ్రీ, ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సంధ్యారాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బుర్ర మోహనకృష్ణ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ధర్నాకు తరలివెళ్లిన సేవాదళ్ సభ్యులు


రాజ్‌కోట్‌కు వెళుతున్న సేవాదళ్ సభ్యులు

మోతీనగర్: గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ నగరంలోని అమ్యూజ్‌మెంట్ పార్కులో మే 26న గేమింగ్ జోన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 27 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం బయటకు రాకుండా అణిచివేసింది. ఇందుకు నిరసనగా ఈ నెల 20 నుంచి 25 వరకు రాజ్‌కోట్‌లో జరిగే ధర్నాలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి 15 మంది సేవాదళ్ సభ్యులు గురువారం రాజ్‌కోట్ తరలివెళ్లారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

నిజాంపేట్: వర్షాకాలం నేపథ్యంలో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షతన అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షలో మేయర్, ఎస్ఇ సత్యనారాయణలతో పాటు వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ, నాలాలు, రోడ్ల పనులు కొనసాగుతున్నాయని, వాటిని మరింత త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు నెలకొన్న కాలనీలు, బస్తీల్లో కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు.

విద్యతో మంచి భవిష్యత్

నిజాంపేట్: పేదల తలరాతలు మార్చేది విద్యేనని, ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం బాచుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, మధ్యాహ్న భోజన పథకం కింద మెరుగైన పౌష్టికాహారాన్ని అందజేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన కొనసాగిస్తోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాసాని సుధాకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ..



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.3 96 లక్షలకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకు సహకరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, కాశీనాథ్ యాదవ్, రాంచందర్, అంకారావు, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

23న బాల బృందావనం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాల బృందావనంను స్టోరీ ఆఫ్ జగదాంబ పేరిట నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటలవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకే అవకాశం కల్పిస్తారు. వివరాలకు ఫోన్: 040-23001234, 8143466670.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఇందిరానగర్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న బండి రమేష్ తదితరులు

బాలానగర్: స్థానిక అసోసియేషన్లు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఇందిరానగర్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అంబేడ్కర్ యువజన సంఘం విజయం సాధించింది. అధ్యక్షుడిగా పుట్టపాక మధు విజయం సాధించారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధుతో పాటు అసోసియేషన్ సభ్యులు బండి రమేష్‌ను బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిని పరిష్కరించేందుకు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పర్మనెంట్ కోసం సీఎంకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం సీఎం నివాసంలో యూటీఏసీ-టీఎస్ (యూనివర్సిటీస్ అసోసియేషన్ కాంట్రాక్టు-తెలంగాణ స్టేట్) ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.పరుశురాం పేర్కొన్నారు. ఉద్యోగాలను పర్మనెంట్ చేసే వరకు యూజీసీ 7వ వేతన సవరణ పీఆర్‌సీ అమలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 65 ఏళ్లకు పెంపు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీ క్యాంపస్‌లో జగిత్యాల, మంథని కాలేజీలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అనీవా ఇంజినీరింగ్ సంస్థ నిర్వాహకులు గురువారం మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా 36 మందికి విద్యా ప్రతిభ కింద ఒకొక్కరికి రూ. 10 వేల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్, కమర్షియల్ సపోర్టర్ మహమ్మద్ హబీబుల్లా మాట్లాడుతూ సంస్థ అబుదాబిలో ఉన్నా హైదరాబాద్ శాఖ తరపున ఇంజనీర్ విభాగంలో ప్రతిభ కనబర్చిన వారికి ఆర్థికంగా సహాయ పడాలన్న సంకల్పంతో స్కాలర్‌షిప్‌లను అందజేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్వామి తురగా, టెక్నికల్ డిపార్టుమెంట్ డైరెక్టర్ సుధీకర్‌కమ్ముదేని, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు, హైదరాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. జి. వి. నరసింహారెడ్డి పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందజేసిన అనీవా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు